# "నేను"

(ఒకరు మరొకరిని ఎన్ని తప్పుడుమాటలయినా అనొచ్చు. ఫరవాలేదు. కానీ చెయ్యి చేసుకుంటే తప్పు. కోర్టుటీవీ ప్రోగ్రాంలలో చూశాను ఈ నీతి. ఆ స్ఫూర్తితో రాసిన కథ.)

మునిసిపల్ ఆఫీసులో నేను కొత్తగా ఉద్యోగంలో చేరినరోజులు.

నేను చేరడానికి పదిరోజులముందు చేరేట్ట సత్యం అని ఒక టైపిస్టు. వంకరటింకరగా గీసినట్టున్నకళ్లూ, తుప్పజుత్తూ, పొట్టిగా, పీలగా, గట్టిగా గాలేస్తే ఎగిరి పడతాడేమో అన్నట్టుండేవాడు. యస్సెల్సీ అయిందనిపించుకుని టైపు నేర్చుకుని ఉద్యోగంలో చేరేడు. ఎవరితో మాట్లాడేవాడు కాదు.

రెండురోజుల్లో నాకు అర్థమయింది. ఆ అబ్బాయికి కొంచెం నత్తి. అంచేతే మాట్లాడడు. అంచేతే పెద్ద చదువులకి పోకుండా టైపు నేర్చుకుని, మాట్లాడక్కర్లేని పనిలో స్థిరబడ్డాడు.

నాకు మరికొన్ని వివరాలు తెలిసేసరికి మరో రెణ్ణెల్లు పట్టింది. వాళ్లమ్మ పొరుగూరు మునసబుగారింట్లో పాచిపని చేస్తుందిట. మునసబుగారు ఇక్కడ ఆఫీసులో తన పలుకుబడి వినియోగించి టైపిస్టు వుద్యోగం ఇప్పించేరు.

ఆఫీసులో సత్యాన్ని సత్యనారాయణ అని పూర్తిపేరుతో ఎవరూ పిలవగా నేను వినలేదు. సత్యం అని కూడా కాదు. అయితే సత్తిగాడు లేకపోతే నత్తిగాడు అనే.

టైపు మాత్రం చాలా బాగా చేసేవాడు. కుప్పలు, కుప్పలు ఫైళ్లు ఇట్టే టైపు చేసి పారేసేవాడు ఒక్క తప్పులేకుండా. సార్ ఎప్పుడయినా ఉత్తరాలు డిక్టేటు చేస్తే, ఏదో రాస్తున్నట్టు గిలికేవాడు షార్టుహేండులో. తరవాత తనభాషలో టైపు చేసేసేవాడు. నాకు అది తెలుసుకోడానికి కొంతకాలం పట్టింది. ఓరోజు అడిగేను, నిజంగా నువ్వు షార్టుహేండు తీసుకుంటున్నావా అని. అతను నవ్వి తనసీటుకి వెళ్లిపోయేడు. అదే తొలిసారి అతనిమొహమ్మీద నవ్వు చూడ్డం నేను. నాకు కూడా సంతోషంగా అనిపించింది ఆపూట. సత్యాన్ని ఎగతాళి చేసేవాళ్లలో ముఖ్యుడు కనకరాజు. అతడు స్ఫురద్రూపి. ఒడ్డూ పొడుక్కీ తగ్గట్టు పచ్చని పసిమిరంగు శరీరచ్ఛాయా, ఎక్స్‌రే కళ్లూ, ఉంగరాలజుత్తూ –కథానాయకుడికి కావలసిన హంగులన్నీ వున్నాయి. అపైన

కలవారి అబ్బాయిట. చదువుమీద శ్రద్ధ లేకపోవడంతో బియే అవగానే ఉద్యోగంలో పెట్టేరు వాళ్లనాన్నగారు. సరదాకో కాలక్షేపానికో వస్తున్నట్టు వేంచేసేవాడు ఆఫీసుకి.

కనకరాజు కూడా సత్యాన్ని సత్యం అని నోరారా పిలవగా నేనెప్పుడూ వినలేదు. ఎప్పుడయినా సరే, ఎవరిఎదుట అయినా సరే "ఒరే సత్తిగా," "నత్తిగా," "పొట్టోడా," "సోడాబుడ్డీ కళ్లోడా" ... ఇలాగే వుండేవి అతని సంబోధనలన్నీ.

అక్కడికీ వూరుకోలేక ఓసారి అడిగేను, "కనకరాజుగారూ, ఎందుకండీ అతన్ని అలా పేర్లు పెట్టి హేళన చేస్తారు?" అని.

కనకరాజు తేలిగ్గా నవ్వేసి. "అదేంలేదు మేడం. చిన్నప్పట్నుంచీ ఎరుగున్నోళ్లం. ఒకే వూరోళ్లం. ఆడేం అనుకోడు మేడం," అన్నాడు.

నిజమే కాబోలు అనుకున్నాను. ఎందుకంటే నాకూ వున్నారు అలాటి స్నేహితులు. అచ్చంగా అలాగే కాకపోయినా, ఒకరినొకరం మాట అనుకోడం, నవ్వేసి వూరుకోడం నాకూ అలవాటే. నా కాలేజీరోజుల్లో కమ్మవారమ్మాయ నాక్లాసుమేటు. తను నన్ను "నల్లబ్రాహ్మల్ని నమ్మకూడదు" అనేది. "కమ్మల్నీ తుమ్మల్నీ నమ్మరాదు" అనేదాన్ని నేను. అక్కడితో సరి. దాన్నెప్పుడూ మేం కులాలవారీయుద్ధంగా తీసుకోలేదు. మాస్నేహానికి అంతరాయం కలగలేదు. ఇప్పటికీ నేను విశాఖపట్నం వస్తే నన్ను చూడ్డానికి విజయవాడనించి వస్తుంది. కనకరాజుకీ సత్యనారాయణకీ కూడా అలాటిస్నేహమేనేమో అని నేను వూరుకున్నాను.

మధ్యాహ్నం టిఫిను టైమవుతోంది. చూస్తున్న ఫైళ్లు మూసేసి, లేవబోతుంటే, సత్యం నాబల్లదగ్గరకి వచ్చేడు. ఏదో ఒకటి మాట్లాడాలి కనక, "అయిపోయిందా పని?" అన్నాను.

సత్యం తలొంచుకు నిలబడ్డాడు. ఆతరవాత ఓకాయితం నాకు అందిచ్చాడు చూడమని.

చదివేను. పది భావకవితలు చదివి వాటిలోంచి నాలుగుపాదాలు తీసుకుని ఎవరో అమ్మాయిని ఉద్దేశించి రాసినట్టున్నాడు. నాకు నవ్వొచ్చింది కానీ నవ్వలేదు. "బాగుంది" అని చెప్పి తిరిగి యిచ్చేసేను ఆ కాయితం.

కొంచెంసేపు వూరుకుని, "ఎందుకు మేడం, అందరూ నన్ను అలా మాటలంటారు?" అన్నాడు నత్తి కప్పి పుచ్చుకోడానికి అవస్థ పడుతూ.
నాకేం చెప్పాలో తోచలేదు.

మళ్లీ అతనే నెమ్మదిగా, తలొంచుకుని నేలచూపులు చూస్తూ, "నేను మాత్రం మనిషిని కానా? నేనేం అందంగా లేనా?"

ఉలికిపడి తేరి చూశాను అతనివేపు. వేరే సందర్భంలో వేరే స్థలంలో ఇంకెవరైనా కనిపించి, "మీఆఫీసులో సత్యనారాయణ అని ఓ అబ్బాయి వున్నాట్ట. ఎలా వుంటాడేమిటి చూడ్డానికి?" అని ఎవరైనా అడిగితే, తడుముకోకుండా వెంటనే,

"ఘోరంగా వుంటాడు" అనేసి, మళ్లీ "చూడ్డానికి ఘోరంగా వుంటాడు కానీ మనిషి మంచివాడు, పని బాగా చేస్తాడు కానీ ..చూడ్డానికి మాత్రం ..." అంటూ నాలుగు నంగిమాటలు అనివుండేదాన్ని. కానీ ఈక్షణం ... ఈ పర్టిక్యులర్ క్షణంలో నాకు తెలివొచ్చింది. అతని ప్రశ్నలో సత్యం బోధపడింది. ఈక్షణంలో నేను చూసిన సత్యంమొహం జన్మలో మరువలేను.

ఆక్షణంలోనే నాకు అర్థమయింది. అతన్నిగురించి నేను ఏం అనుకుంటున్నాను అన్నది కాదు ప్రధానం. అతనికి తనమీద తనకి గల అభిప్రాయమే నేను గౌరవించాలి. నాకు తేరుకోడానికి రెండు నిముషాలు పట్టింది. "ఎందుకలా అనుకుంటారు మీరు? మీగురించి మీకు వున్నఅభిప్రాయం ప్రధానం కానీ ఎవరో ఏదో అంటున్నారని మీరెందుకు బాధ పడడం?" అన్నాను.

నామాటలు నాకే బోళాగా వినిపించేయి. కానీ అంతకంటే ఏం చెయ్యను? ఏం చెప్పగలను? మనకొచ్చిన చదువులూ, మనం నేర్చిన నాగరికతలూ అలాటివి. "నమస్తే మేడమ్" అనేసి సత్యం వెనుదిరిగి వెళ్లిపోయేడు.

నాకు మాత్రం ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు.

ఆతరవాత వరసగా రెండురోజులు ఆఫీసులో మిగతా గుమాస్తాలు కూడా సత్యాన్ని ఎగతాళి చెయ్యడం మొదలు పెట్టేరు.

"ఏరా నత్తిగా! ప్రేమగీతాలు రాస్తున్నవేటి? ఎవుర్రా ఆ పిల్ల?"

"జాగర్తరోయ్. పిల్ల తాలూకాళ్లు చూసేరంటే మక్కలిరగదన్నేగల్రు."

"నత్తోడికి పిల్లనెవరిస్తార్రా ఎర్రెదవా. ఆయిగ నీబతుకేదో నివ్వు బతుకు. ఎర్రేసాలు పోమాక."

వాళ్లమాటలు చూస్తే నాకు మహ చిరాకేస్తోంది. కనకరాజుమాటలు గుర్తొచ్చేయి. వాళ్లకీ వాళ్లకీ వున్న స్నేహాలు అలాటివిలే అని నన్ను నేను సమాధానపర్చుకోడం కూడా కష్టంగానే వుంది.

ఆరోజు సత్యం కొత్తచొక్కా కొత్తపేంటు వేసుకు వచ్చాడు. మనిషిలో ఎన్నడూ లేని హుషారు కనిపిస్తోంది. ఏదో విశేషం వుంది అనుకున్నాను కానీ అడగలేదు. తలొంచుకుని ముందున్న ఫైలు చూస్తున్నాను.

"ఏరా, పెళ్లికొడకా, ఎప్పుడ్రా పప్పన్నాలు?" అంటూ కనకరాజు వచ్చేడు. నేను తలెత్తి చూశాను. సత్యం మాటాడకుండా టైపు చేసుకుపోతున్నాడు తనమానాన. "ఒరే, నామాటిని చేస్కోనని చెప్పెయరా. చేసుకుంటివా, కనీసం మరో అవిటోన్ని పుట్టించి నాలాటోల్ల ప్రానాలు తీమాక" కనకరాజు నవ్వేడు గలగలా.

సత్యం తలెత్తి విసురుగా చూసేడు.

ఆమాట ఏసంబంధమూ లేని నాకే ఛెళ్లున తగిలింది. "కనకరాజుగారూ," ఏదో అనబోతున్నాను. నావాక్యం పూర్తి కానేలేదు. సత్యం చేతిలో వున్న క్లిప్ బోర్డు

విసిరికొట్టేడు కనకరాజుమీదికి. అది కనకరాజు నుదుటికి తగిలి నేలమీద పడింది ఠప్మని చప్పుడు చేస్తూ. కనకరాజు నుదురు చిట్లింది.

కనకరాజు నోటికిరాని తిట్లు లంకించుకుని, సత్యంకాలరు పుచ్చుకుని గుంజేడు. మరో ఇద్దరు గుమాస్తాలూ, ఆఫీసు ప్యూనూ వచ్చి వాళ్లని విడిపించేరు. సార్ గబగబా వచ్చేరు "ఏమయిందేమయింది?" అంటూ.

అక్కడ వున్నవారందరూ గలగలా ఎవరి వెర్షను వాళ్లు చెప్పడం మొదలెట్టేరు గోలగోలగా. మౌనంగా చూస్తూ వూరుకున్నదాన్ని నేనొక్కర్తినే.

సార్ షటప్ అని అరిచి అందరినోళ్లూ మూయించి, ఎవరి సీటులోకి వారిని తోలేసి, కనకరాజునీ, సత్యాన్ని "పదండి నారూంకి" అంటూ తనవెంట తీసుకుపోయేరు. ఓగంట తరవాత, నన్ను పిలిచేరు. "మీ సెక్షనులో మీసమక్షంలో జరిగింది కనక మీకే సంగతి బాగా తెలియాలి. అంచేత మీరు రిపోర్టు రాసి ఇవ్వండి. తరవాత నేను వాళ్లిద్దరిమీదా తగినచర్య తీసుకుంటాను" అన్నారు.

"అంతకుముందేం జరిగిందో, వాళ్లిద్దరిమధ్యన ఏం లావాదేవీలున్నాయో నాకు తెలీవండీ" అన్నాను ఆ రంధిలో ఇరుక్కోడం ఇష్టం లేక.

"అవన్నీ మనకి అక్కర్లేదండీ. ఈపూట మీరూంలో ఏంజరిగిందో మీరు చూసింది చూసినట్టు రాసివ్వండి చాలు. తరవాత నేను చూసుకుంటాను," అన్నారాయన.

"సరేనండీ," అని చెప్పి నాసీటుకి వచ్చేశాను. సత్యం నావేపు ఒకసారి చూసి తలొంచుకుని టైపులో పడిపోయేడు. పక్కగదిలో కనకరాజు సణుగుడు ఇంకా వినిపిస్తూనే వుంది.

ఆసాయంత్రం ఇంటికొచ్చి, కాఫీ తాగి, పత్రిక పట్టుకుని కూర్చున్నాను. కనకరాజు వచ్చేడు, "నమస్తే మేడమ్" అంటూ.

"రండి, ఏం ఇలా వచ్చేరు?" అన్నాను ఎదటికుర్చీ చూపిస్తూ.

కనకరాజు అట్టే తాత్సారం చెయ్యలేదు. "మీరు రిపోర్టు రాస్తున్నారుట కదా మేడమ్," అన్నాడు.

"ఊఁ" అన్నాను అతనివేపు పరీక్షగా చూస్తూ.

"అదికాదు మేడమ్. నాతప్పేమిటి చెప్పండి మేడమ్. నేనేం కానిమాట అంటినా?" అన్నాడు. తన తప్పేం లేదని గట్టిగానే నమ్ముతున్నట్టు కనిపించేడు,

"మీరు అలా అతన్ని నానాపేర్లూ పెట్టి పిలవడం బావులేదండీ మరీ" అన్నాను వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా. చాలారోజులుగా ఈమాట కనకరాజుకి చెప్పాలని వుంది నాకు.

"నేనేం లేనిమాట అన్నాను మేడమ్? అవిటోన్ని అవిటోడు అంటే తప్పెట్ల అవుతాది? వున్నమాటే గద. అది సత్యమే గద" అన్నాడతను.

"ఆమాట బాధిస్తుంది కనక" అన్నాను.

"అయితే, నన్నూ అనమండి పడతాను. అంతే కానీ కొడితే ఎట్లా? చూడండి చందమామలో మచ్చమాదిరి నుదుటిమీద ఈ మచ్చ శాశ్వతంగా వుండిపోతంది. అసలు కొట్టానికి ఆడికేటి అధికారం వున్నది?"

నేను అతనివేపే చూస్తూ వుండిపోయాను కొన్నిక్షణాలపాటు. ఈమనిషితత్వం ఏమయివుంటుంది? కనకరాజుకి సంబంధించినంతవరకూ - లోకం సమస్తం తనచుట్టూ తిరుగుతోంది, తనకి తెలిసిందే జ్ఞానం. తనఅనుభవంలోకి వచ్చిందే వాస్తవం. తనకి కలిగిందే నొప్పి. అంతే.

కానీ ఎదటిమనిషి కూడా తనలాటివాడే అనీ, తనకిలాగే అవతలివాడికి కూడా ఓ మనసుంటుందనీ, అది నొచ్చుకోగలదనీ కనకరాజులాటి మనుషులకి తోచదు. తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చునేమో కానీ కనకరాజుమనసు రంజింపజేయడం నాతరం కాదు..

"సరేలెండి. రేపు చూద్దాం. పన్లో వున్నాను," అన్నాను చేతిలో పత్రిక కింద పడేస్తూ.

కనకరాజు లేస్తూ, "నామాదిరి అందగాడయితే అనుకోవచ్చును గానీ అవిటోన్ని అవిటోడు అంటే తప్పేంటి?" అంటూ మరోసారి వెకిలిగా నవ్వి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నిష్క్రమించేడు అతను.

నాకు ఆలోచనలు ఒకంతట తెగలేదు. ఒకరిమీద చెయ్యి చేసుకోరాదు. ఈటెల్లాటి మాటలతో పోట్లు పొడిస్తే తప్పు లేదు. ఇదీ కోర్టులు చెప్పే న్యాయం. ఎదటివాడిమీద చెయ్యి చేసుకున్నవాడిదే తప్పు. వాడికే శిక్ష.

మరి నాకర్తవ్యం కూడా అదేనా? ... "నేను అందంగా లేనా?" అంటూ ప్రశ్నిస్తూన్న సత్యం నామనసున మెదిలేడు. అతనిలో ఆ "నేను" ... అదే అహం. అదే జీవం. అదే ప్రాణం. అదే పొద్దు పొడిచిందగ్గర్నుంచీ పొద్దు గూకేవరకూ మనిషిని నడిపించే మహాయంత్రం. అదే "అయిదురేకుల దీపకళిక". ఎదటివారికి ఎంత హీనంగా కనిపించినా, మనిషి జన్మ ఎత్తిన ప్రతివాడిలో ఆ"నేను" వుంటుంది నిస్సందేహంగా. వుండితీరాలి. సత్యం ఈరేడులోకాలా ఏ గణనాంకాల్లోకీ ఎక్కకపోవచ్చు కానీ తనకి తాను ఒక మనిషే1

కలం తీసుకున్నాను రిపోర్టు రాయడానికి.

***

(22 జూన్ 2009)

❀ ❀ ❀